

కథా కౌముది

# రాజు—జాకీ-రాణి

మోచర్ల అనంత పద్మనాభరావు

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో
### సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

"ధర్మరాజూ ! ముక్కెయ్యడానికి అంత ఆలోచన దేనికయ్యా? దీన్ని తీసేయ్యొచ్చుగా!" అప్పుడే వచ్చిన జాకీర్, ధర్మరాజు చేతిలో పేకను తీసుకుని ఆటీను రాణీను కింద పడేసాడు.

"అరెరే! ఎంత పని చేసావు జాకీరన్నా. ఆ రాణి మొదటి నుంచి మనతో ఉంది." బాధపడ్తో అన్నాడు.

"మరీ కట్టుకున్నది పోయినట్టుగా బాధ పడ్తున్నావేంటన్న? జాకీ జోకరై నప్పుడు ఈ రాణితో నీకు పనేంటి?" పేకముక్కల్ని తిరిగి ధర్మరాజు చేతిలో పెడ్తూ అన్నాడు జాకీర్.

భాగ్యనగరంలో అదో పెద్ద ప్రభుత్వ సంస్థ. అందులో వందలకొలది ఉద్యోగులు. వారిలో నాలుగో తరగతి ఉద్యోగులు ఓ ప్రత్యేక వర్గం. వారు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులు. ప్రజలకు సంబంధించిన పనులన్నీ వారి ప్రమేయంతోనే జరగాలి. వారికో గుర్తింపు పొందిన సంఘం. దానికి అనుబంధంగా ఒక రిక్రియేషన్ రూము కూడా ఉంది. ఉద్యోగుల మానసికోల్లాసం కోసం వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ లాంటి క్రీడలే కాకుండా, పేకాట, క్యారమ్స్ లాంటి వినోదాన్ని, విజ్ఞాన్ని పంచే ఆటలు కూడా అక్కడ ఉన్నాయి. కొద్దిమంది విజ్ఞానాన్ని పక్కన పెట్టి వినోదాన్ని, దాంతో బాటు ధనాన్ని పంచుకోడానికి పేక, క్యారమ్స్ ఆటల వైపే మొగ్గు చూపుతారని పిస్తుంది ఆ రెండాటల కోసం ఎగబడే వాళ్ళను చూస్తే. ఏ క్రీడలు ఆడలేని బలహీనులు ఆడేవాళ్ళ పక్కన చేరి ఉత్సాహం, ఉత్తేజం పొందుతూ ఉంటారు.

జాకీర్ ఆ ఉద్యోగుల సంఘానికి పెద్ద నాయకుడు. ఎత్తులకు పై ఎత్తులు వేయడంలో దిట్ట. ఆ ఆఫీసులోనే కాదు సెక్రటేరియట్ లెవెల్లో కూడా మంచి పలుకుబడి ఉందని ప్రతీతి. అందుకే పెద్ద ఆఫీసర్లు కూడా అతనంటే కొంచెం భయపడ్తూంటారు. నాలుగో తరగతి ఉద్యోగులంతా అతని కనుసన్నల లోనే మెదులుతూ ఉంటారు. అతని సలహా తీసుకోకుండా వారు ఆఫీసు పనే కాదు ఏ పనీ చేయరు.

ధర్మరాజు  ఆ సంస్థలో ఓ అటెండర్. జాకీర్ అనుచరగణంలో ముఖ్యుడు. ధర్మరాజుకి పేకాటంటే పిచ్చి. రోజూ ఒకటి రెండు గంటలు పేకాట ఆడందే ఇంటికెళ్ళడు. రోజూలాగే పేకాట జోరుగా సాగుతోంది. తన వంతు వచ్చేసరికి ధర్మరాజు పేకలోంచి ఓ ముక్క తీసాడు. అది కళావరు రాణీ. దీనంగా జాకీర్ కేసి చూసాడు.

“నీ పేరే ధర్మరాజు...నీకు రాణీలకు కొదవేంటి? ఒకటి పోతే మరోటి. ఎటొచ్చి రంగు మారిందంతే. ఇక చూడు ఈ రాణీగారు నీ ఆటని తారుమారు చేస్తుంది. పై రౌండులో వచ్చే జోకర్ సాయంతో ఈ రాణీగారిని వదిలించుకోవచ్చు.” తన అంచనా లెప్పుడూ  తప్పవన్నంత ధీమాగా చెప్పాడు. జాకీర్ అన్నట్టుగానే కళావరు జాకీ వచ్చింది ధర్మరాజుకి. జోకరొచ్చిన సంతోషంలో కళావరు రాణీని పడేసాడు. అదే అతను చేసిన తప్పు. ఆ రాణీగారు పక్కవాడి పేకలో చేరి వాడి పంట పండించారు. దాంతో ధర్మరాజు ఆట పాతనగరం వరదలకు బురదపాలైన  కొత్త కారులా పనికి రాకుండా పోయింది. కౌంటిచ్చి ఆటకు స్వస్తి చెప్పి జాకీర్ తో సహా జాక్ అండ్ జిల్ బార్ ను దర్శించుకున్నాడు.

★★★

బార్ లో మంచి కిక్కిచ్చే మందుకొట్టి ఇంటికి చేరిన ధర్మరాజుకు పెళ్ళాం  రాణెమ్మ గుమ్మంలోనే కబురు చెప్పింది. గబగబా బాత్రూంలో ఓ బకెట్ నీళ్ళు గుమ్మరించుకుని భోజనానికి కూర్చునే సరికి తోడల్లుడు కన్నీళ్ళతో పక్కకు చేరాడు.

“రాణెమ్మ గుమ్మంలోనే... నీ ఇసయం...మొత్తం నా బుర్రలో కెక్కించేసింది. బాధ పడకు. అలా కల్ల నీల్లెట్టుకుంటే...కస్టాలు పోతాయా. నీ కస్టాలు జాకీరన్నతో మాటాడతా... ఆటికి పరిస్కారం అన్నే సూపించాలా. ఇప్పటికే శానా...రాత్రయింది. మిగిలిన ఇసయాలు రేపు... ఇక నీ పోయి పడుకో.” వరదల్లో చిక్కుకున్న ప్రజలకు ఆకాశం నుంచి పులిహోర పొట్లాలు పడినట్టు ధర్మరాజు నోట్లోంచి మాటలు ఒక్కొక్కటిగా  జారి పడుతున్నాయి మత్తుగా.

తినడం ముగించి తడబడుతూ మంచమెక్కాడు. పని ముగించుకొచ్చిన రాణెమ్మ పత్తి బస్తాలా మంచంపై పడున్న ధర్మరాజుని పక్కకు జరిపి నడుం వాల్చింది. పక్క గదిలో చెల్లెలు చంద్రమ్మ బాధతో మూలుగుతోంది. మరిది భీమరాజు ముఖం దిగులుగా కళ్ళ ముందు కదులుతోంది. తన పెళ్ళయ్యాకా తల్లిదండ్రి పోతే ధర్మరాజే తండ్రై చెల్లెలు చంద్రమ్మ పెళ్లి  చేసాడు. అప్పట్నుంచి వాళ్ళ కష్టసుఖాలు చూస్తూనే ఉన్నాడు. తన పెళ్లై ఇరవై ఏళ్లయ్యింది, ‘ఏ జన్మలో ఏం పాపం చేసానో ఈ జన్మలో పిల్లల్నియ్యలేదు పరమాత్ముడు.’ అశాంతిగా మంచంపై దొర్లింది. మాయదారి రోగం చెల్లెల్ని

మంచం పాల్చేసింది. 'అక్కా నీవే దిక్కంటూ' గుమ్మంలో కొచ్చింది. ధర్మరాజు లాంటి భర్త, ఎదోలాగ సాయం చేస్తాడనే నమ్మకం. అందుకనే గుమ్మలోనే భర్తకు మొత్తం చెప్పేసింది. గజిబిజి ఆలోచనలతో సతమతమై పోతోంది. విచ్చుకున్న పత్తికాయలయ్యాయి రాణెమ్మ కళ్ళు. తోడబుట్టింది కష్టాల్లో ఉంటే నిద్రెలా వస్తుంది.

★★★

"ఏమయ్యో! మా చెల్లి సంగతి ఏమాలోచించావు? జాకీరన్న కడకు పోయేదెప్పుడు?" తెల్లారి మంచం మీదున్న మొగుడ్ని ప్రశ్నలతో కుదిపి లేపి కూర్చోపెట్టింది రాణెమ్మ.

పది దాటిం తర్వాత భీమరాజుని తీసుకుని జాకీర్ ఇంటి కెళ్ళాడు. తీరిగ్గా పేపర్ చదువుతున్నాడు జాకీర్.

"నమస్తే అన్నా!" వినయంగా సలాం పెట్టాడు ధర్మరాజు.

"ఏంటి రాజు ఇంత పొద్దుగాలే ఇంటికొచ్చావంటే ఎదో పెద్ద పనే ఉండి ఉంటది. ఏంటంట? ఈయనెవరు?"

"భీమరాజని మా తోడల్లుడన్నా. మిర్యాలగూడలో రైసుమిల్లులో పని చేస్తాడు. నీ దగ్గర దాపరికాలెందుగాని, మా మరదలకు ఆరోగ్యం బాలేదు. ఉన్నపళంగా సిటీకి తీసుకుపోమ్మన్నారని ఆమెను తీసుకుని నిన్న రాత్రి వచ్చిండు. ఇగో ఈ కాయితాలు సూడన్నా మొత్తం నీకే అర్ధమౌతుంది." అంటూ భీమరాజు దగ్గర పేపర్లన్నీ జాకీర్ చేతిలో పెట్టాడు.

పదినిమిషాల సేపు పేపర్లన్ని తిరగేసి చిన్నగా నిట్టూర్చాడు. "నాకు తెల్సిన డాక్టరున్నాడు ఆయనకి చూపించు. ఆయనేం చెబ్తాడో చూద్దాం." డాక్టర్ అడ్రస్ చెప్పి, "మీరెళ్ళండి ఆయన దగ్గరకు, నేను తయారై వస్తా, ఒకే..." లేచాడు జాకీర్.

★★★

చంద్రమ్మను పరీక్షించి వెంటనే ఆసుపత్రిలో అడ్మిట్ చేయమన్నాడు డాక్టర్. మర్నాడు కొన్ని టెస్టులు చేసి ఆపరేషన్ చెయ్యాలని, ఆ తర్వాత కీమో థెరపీ మొదలెట్టాలని ప్రస్తుతానికి రెండు లక్షలు వరకు అవుతుందని చెప్పాడు.

సాయంత్రం జాకీరన్నను యూనియన్ ఆఫీసులో కలిసాడు ధర్మరాజు. "అన్నా! మా భీమరాజు గరీబోడు. ఆయనకు తెల్లకార్డు కూడా లేదు. ఇక ఆరోగ్యశ్రీ ఎట్ల వస్తాది. ఏంటో గరీబోల్లకే ఖరీదైన రోగాలొస్తాయేమో? మా రాణెమ్మ సానా దిగులుగా ఉంది. 'నువ్వేం పాట్లు పడతవో నాకైతే ఎరుకలేదు. మా సెల్లికి వైద్దెం జరగాలి. అది రోగం నుంచి బయటపడాలి.' అంది. జాకీరన్నా నువ్వే ఆదుకోవాలి. నువ్వు మాకు నాయకుడివే కాదు, ఆపదలో ఆదుకునే దేవుడివి కూడా. నీ కాళ్ళు పట్టుకుంటా ఎట్లైనా నన్నీ కష్టం నుంచి బయట పడేయన్నా." జాకీర్ చేతులు పట్టుకుని బతిమాలేడు ధర్మరాజు.

"ధర్మరాజు! నీకున్న అప్పులకు మీ మరదలు వైద్యం తలకు మించిన భారమౌతుంది. మీ తోడల్లుడు దగ్గర అసలు సొమ్ములేం లేవా ? పోనీ, పొలం, బంగారం లాంటివి కూడా లేవా?"

"ఆయనే ఉంటే మంగలెందు కన్నట్టు మా తోడల్లుడు దగ్గర భూమి, బంగారం కాదు కదా ఎర్రని ఏగాని కూడా లేదు. గాజుల బేరం బోజనానికి సరన్నట్టు రైసుమిల్లులో వచ్చే జీతం సంసారానికే సరిపోదు. ఇక ఆస్తులెక్కడ సంపాదిస్తాడు. పెళ్ళాం రోగానికి మిల్లు సావుకారు దగ్గర బదులు తీసుకుని ఇప్పటివరకు కర్సు పెట్టాడు. ఇపుడాయిన్ని ఈడ్చి తంతే ఏగాని కూడా రాలదు. నువ్వే ఏదోటి సేయాల. లేకపోతే బయిటెక్కడైనా అప్పు ఇప్పించి ఆదుకో అన్నా." జూదంలో సర్వం పోగొట్టుకుని అయిదూళ్ళడిగిన భారతంలో ధర్మరాజులా అడిగాడు అటెండర్ ధర్మరాజు.

"నీ మాటలకు బుర్ర వేడెక్కి పోతోంది. నాకేం ఐడియా రావడం లేదు. నడు జాక్ అండ్ జిల్ కి. అక్కడైతే మంచి మంచి అయిడియాలు రావచ్చు. ఏమంటావు ?" ధర్మరాజు జాకీరన్నను అనుసరించాడు.

★★★

జాకీరన్న చెప్పిన సలహాకు పొంగిపోయాడు ధర్మరాజు. అతని రెండు చేతులు పట్టుకుని సంతోషంగా ఊపుతో, "ఇన్నాల్లు గుర్రాలని పరిగెత్తించే వాడే జాకీ అని అనుకున్నా నన్నా. కానీ మా జాకీరన్న మా బతుకుల్ని పరిగెత్తించే జాకీ అని ఇప్పుడే సమజయ్యింది. నీ ముందు ఎవరైనా బలాదూరన్నా...!" ఆ ఊపులోనే బేరర్ని పిలిచి ఇంకో రెండు పెగ్గులు తెమ్మన్నాడు.

"ధర్మరాజు ...! ఇది చాలా సీక్రెట్టుగా ఉంచాల్సిన విషయం. మనసులో పెట్టుకో. ఇంకొకరికి తెలియ కూడదు. మిగతావన్నీ నే చూసుకుంటా. గప్చిప్ గా జరగాలి. మాటివ్వు." చేతిలో చెయ్యి వేయించుకున్నాడు జాకీర్.

గాలిలో తేలిపోతూ ఇంటికి చేరాడు ధర్మరాజు. జాకీరన్న మంచి సలహా నిచ్చి దేవుడిలా మనల్ని ఆదుకున్నాడన్నాడని రాణెమ్మకు చెప్పాడు. చంద్రమ్మకు ఆపరేషన్, డాక్టర్ చెప్పిన వైద్యం చేయించాలంటే జాకీరన్న చెప్పినట్టు చేయాలన్నాడు. అంతా అనుకున్నాట్టు జరిగితే చంద్రమ్మ ఆరోగ్యానికి ఢోకా లేదన్నాడు.

★★★

మర్నాడు చంద్రమ్మని ఆసుపత్రిలో అడ్మిట్ చేసాడు ధర్మరాజు. సంస్థ నుంచి అడ్వాన్స్ తీసుకున్నాడు. చంద్రమ్మకు ఆపరేషన్ జరిగింది. వారం తర్వాత ఇంటికి తీసుకొచ్చారు. రాణెమ్మ తన భర్త ఔదార్యానికి పొంగిపోయింది. పిల్లల్ని ఇవ్వకపోయినా మంచి భర్తను ఇచ్చినందుకు దేవుడికి మొక్కింది. చంద్రమ్మకు కీమో థెరపీ కూడా మొదలయ్యింది. ఎప్పటికప్పుడు ఆసుపత్రి బిల్లులను సంస్థ చెల్లించడంతో చంద్రమ్మ వైద్యం నిరాఘాటంగా జరిగిపోతోంది. పది నెలలు వైద్యం తరువాత చంద్రమ్మకు రోగం తిరగబెట్టి ప్రాణం మీదకొచ్చింది. అత్యవసరంగా ఆసుపత్రిలో చేర్చారు. మూడు రోజులు మృత్యువుతో పోరాడి చంద్రమ్మ ఓడిపోయింది. ధర్మరాజు చేసిన సహాయం వృథా అయినందుకు రాణెమ్మ దుఖం పట్టపగ్గాలు లేకుండా పోయింది. చంద్రమ్మ మృతదేహాన్ని ఆసుపత్రి నుంచి మిర్యాలగూడ తరలించారు. ధర్మరాజు,

రాణెమ్మ దగ్గరుండి చంద్రమ్మ అంతిమ కార్యాక్రమాలు జరిపించారు. డెత్ సర్టిఫికేట్ తో పాటు ఆఖరి బిల్లును సంస్థకు సమర్పించి దాని తాలూకు సొమ్ముని సంస్థ నుంచి పొందాడు ధర్మరాజు. సంస్థ ఉద్యోగులందరూ ఒక్కొక్కరుగా ధర్మరాజుకు తమ సానుభూతిని తెలియపర్చారు. జాకీరన్న సలహా ప్రకారం ధర్మరాజు పూర్తి మౌనం పాటించాడు.

సంవత్సరం గడిచిపోయింది. ఓ సాయంత్రం పేకాటలో ముక్కలు పంచి జోకర్ కట్ చేసి తన ముక్కలు తీసుకుని చూసుకున్నాడు ధర్మరాజు. డీల్ షో పడింది. ఆనందంతో చేతులు వణికాయి. టెన్షన్ కమ్మేసింది ఒక్కసారిగా, ఒళ్ళు చెమటలుతో తడ్సిపోతోంది. కళ్ళు మసకబారి మూతబడ్తున్నాయి. అలాగే టేబుల్ పై ఒరిగిపోయాడు. విషయం తెలిసిన రాణెమ్మ సృహ కోల్పోయింది.

తెలివొచ్చేసరికి రాణెమ్మ తాళి తెగిపోయింది. తెల్ల గోడపై నున్న ధర్మరాజు ఫోటోకి దండ పడింది.

★★★

"అపుడెపుడో మాయా జూదంలో ధర్మరాజు ద్రౌపదిని కోల్పోయాడు. నన్నోడి తన్నోడినా, తన్నోడి నన్నోడినా అన్న ద్రౌపది ప్రశ్నలకు సమాధాన మియ్యలేక తలవొంచుకున్నాడు ధర్మరాజు. అది పురాణ కత కనుక బాద లేకపోయింది. మరి నా బతుకు కతలా ఎందుకయ్యిందయ్యా?" రాణెమ్మ ధర్మరాజు ఫోటోకేసి చూసింది. 'నన్ను క్షమించు రాణెమ్మ' అన్నట్టుగా దీనంగా కనిపించాడు ధర్మరాజు. "ఆ మారాజు మాట కోసరమని పెల్లాన్ని పనంగా పెట్టాడు. మరి నువ్వు...?" ధర్మరాజుని ప్రశ్నించింది చూపులతో.

"నువ్వో పిచ్చి మారాజువయ్యా మొగడా! కాకపోతే ఏటి? ఇంకొకరి పెల్లం కోసం నీ పెల్లాన్నే పనంగా పెట్టుకుంటావా? మా ఆడోల్లం ఎన్నో అంటాం. అన్నీ పట్టించుకోడమే మీ మొగుళ్ళ పనా? కాస్త ముందెనక ఆలోచించరా? ఆ ధర్మరాజుకు మల్లే నీకు కూడా బుద్ధి నేకుండా పోయిందా? నన్నన్నాయం సేసి పోతావా? నా బతుకు బుగ్గిపాలు సేస్తావా? ఆ జాకీరన్న మాటిని బతికున్నదాన్ని సంపెసావు కదయ్యా? నేను నిజంగా సచ్చిపోయానా? బారతంలో ఉంటాడే గడ్డపోయన పాచికలాడతాడు ఆయనకు మల్లే మన బతుకుల్లో ఈ జాకీ ఎలా దాపురించాడో ఏంటో? హాయిగా రాజు రాణీలా ఉండే మన మద్దె 'జాకీ' రన్న సేరి మన బతుకాటను తారుమారు సేసాడయ్యా. నువ్ పోయేకా మీ ఆపీసు నుంచి రావాల్సిన నీ సొమ్ములు, ఫేమిలీ పించను కోసం జాకీరన్న కాదక పొతే గోర నిజం తెల్సి నే నక్కడ నిజంగానే సచ్చిపోయాను మొగడా. ఆ రోజు జాకీరన్న ఏమన్నాడో తెల్సా?

"చూడు చెల్లెమ్మా! ధర్మరాజు నిజంగా మనసున్న మారాజే. ఎప్పుడైతే నువ్వు మీ చెల్లిలికి వైద్యం చేయించాలని అన్నావో, అప్పుడు నన్నడిగాడు ఏం చేయాలని. అప్పటి అతని ఆర్ధిక పరిస్థితి అసలు బాలేదు. ఎక్కడా అప్పు దొరికే అవకాశం లేకపోయింది. చాలా ఆలోచించాను. అప్పుడు నాకు ఒకే దారి కనిపించింది. మా సంస్థలో ఉద్యోగికి గాని, అతని కుటుంబ సభ్యులకిగాని వైద్యం నిమిత్తం అయిన ఖర్చును సంస్థ తిరిగి చెల్లిస్తుంది. అందుకని నీ చెల్లిలిని నీ పేరుతో ఆసుపత్రిలో చేర్పించి ధర్మరాజు భార్యకు వైద్యం జరుగుతుందని సంస్థను నమ్మించి, ఆ ఖర్చుని సంస్థ నుంచి

పొందడం ఒక్కటే మార్గమని చెప్పాను. అది తప్పని తెలుసు. మా సంస్థను మోసం చేస్తున్నామని కూడా తెలుసు. తర్వాతెప్పుడైనా ధర్మరాజు చేసిన మోసం సంస్థకు తెలిస్తే అతని ఉద్యోగం పోతుందని, కటకటాలు పాలవుతాడని తెలుసు. ఇన్ని తెలిసినా నీ కోసం, నీకిచ్చిన మాట కోసం ధర్మరాజు నా సలహాకు సరే నన్నాడు. కానీ, ఇలా జరుగుతుందని ఊహించ లేకపోయాం. ఇప్పుడు సంస్థ దృష్టిలో నువ్వు లేవు చెల్లమ్మా. నువ్వు చనిపోయినట్టు ఆసుపత్రి ఇచ్చిన సర్టిఫికేట్ సంస్థ రిజిస్టరులలో నమోదైపోయింది. ఇక సంస్థ నుంచి ధర్మరాజు కొచ్చే సొమ్ములేవి రావు. నువ్వు బతికున్నావనే విషయం సంస్థకు తెలిస్తే నీ మీద కూడా క్రిమినల్ కేసు పెట్టే ఆస్కారం ఉంది. అందుకని నువ్వు ఆ సొమ్ములపై ఆశ వదులుకో." అన్నాడయ్యా.

"సెప్పుడు మాటలిని, తప్పుడు పనులు సేస్తావా? రోగమొచ్చి నా సెల్లి సచ్చిపోయింది. మరి నేను...?? నువ్ సేసిన మోసం వల్ల సచ్చిపోయాను. ఎనకటికి నూరు అబద్దాలాడి ఓ పెళ్లి సేయమన్నారు, అంతే కాని ఒక్క అబద్దమాడి పెల్లాన్ని సంపెయమనలేదుగా...? దరమరాజు పేరెట్టుకుని అంత అదరమమైన పనేట్టా సేసావయ్యా? కన్నతల్లి లాంటి సంస్తను మోసం సేసి బతికున్న నన్ను అన్నాయెం సేసావు. నువ్వు నేవు, నీ సొమ్ములు నేవు. నేనెలా బతికేది? నన్నేంటి సేయమంటావు? సెప్పు ఓ దరమరాజా...సెప్పు...!" గుండెలు బాదుకుంది రాణెమ్మ.

ఆమె ప్రశ్నలకు సమాధానం చెప్పలేని ధర్మరాజు నిర్వికారంగా చూస్తున్నాడు ఫోటోలోంచి.

COMMENTS